క్లుప్తంగా

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

ఇచ్ఛాపురం రూరల్: మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లను గురువారం పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు బుధవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరగనున్న ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ చేతులు మీదుగా 458 కొత్త పింఛన్లను పంపిణీ జరుగుతోందన్నారు.

మందస పీఎస్‌ను సందర్శించిన డీఎస్పీ

మందస: మందస పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ భద్రత, రికార్డులు పరిశీలించారు క్రైమ్ రేటు ఎలా ఉందో రికార్డులు తనిఖీ చేసి తెలుసుకున్నారు. రహదారుల ప్రమాదాలు, నివారణపై తీసుకుంటున్న చర్యలను ఎస్ఐ ఎనుకోటి రవికుమార్ నుంచి ఆరా తీశారు. స్పందనకు వచ్చిన దరఖాస్తును నిర్ణీత సమయంలోనే పరిష్కరించాలన్నారు. కాశీబుగ్గ రూరల్ సీఐ శంకరరావు ఉన్నారు.

వెటర్నరీ డీడీ జయరాజ్‌కు సత్కారం



జయరాజ్‌ను సత్కరిస్తున్న పశువైద్య సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: టెక్కలి పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా డాక్టర్ వి.జయరాజ్ పదోన్నతి పొందారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన్ని ఇచ్ఛాపురం మండలానికి చెందిన పశు వైద్యాధికారి డాక్టర్ లవ్‌కుమార్, సిబ్బంది కాశీప్రసాద్, సతీష్, శ్రీధర్‌లు టెక్కలిలో బుధవారం సత్కరించి అభినందించారు.

పిల్లలకు టీకాలు



పిల్లలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

కోటబొమ్మాళి: స్థానిక మేజర్ పంచాయితీ 1, 2 వార్డుల పరిధిలో చిన్నపిల్లలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని బుధవారం సర్పంచ్ కాల్ల సంజీవరావు ప్రారంభించారు. ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాధినిరోధక టీకాలను కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది వేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గౌరీ, లక్ష్మి పాల్గొన్నారు.

నేడు క్రీడాకారుల ఎంపిక



క్రీడా కోర్టులు సిద్ధం చేస్తున్న దృశ్యం

కవిటి: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో పాల్గొనే మండలస్థాయి క్రీడాకారుల ఎంపికను గురువారం చేపడుతున్నట్టు మండల స్పోర్ట్స్ ఆఫీసర్ పాడియా కృష్ణ తెలిపారు. ఇందులో భాగంగా ఎంపిక పోటీలు నిర్వహించే కవిటి ప్రభుత్వ పాఠశాల క్రీడామైదానంలో కోర్టులను బుధవారం సిద్ధం చేశారు. బాలుర విభాగంలో అండర్-14, అండర్-17, బాలికల విభాగంలో రెండు కేటగిరీల వారు పాల్గొన వచ్చన్నారు.

నేడు 14వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 14వ వార్డులో గురువారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వార్డు కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమంలో మంత్రి సీదిరి అప్పలరాజు, మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు తదితరులు పాల్గొంటారన్నారు.

మందస డీటీకి పదోన్నతి



కె.విజయలక్ష్మి

మందస: మందస డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న కె.విజయలక్ష్మికి తహసీల్దార్‌గా పదోన్నతి లభించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో డీటీగా బాధ్యతలు చేపట్టిన ఆమెను శ్రీకాకుళంలోని ఆర్డీవో కార్యాలయంలో కోనేరు రంగారావు కమిటీ తహసీల్దార్‌గా నియమించి బదిలీ చేశారు.

వ్యక్తిపై ఫిర్యాదు

ఆమదాలవలస రూరల్: అర్ధ రాత్రి సమయంలో ఇంటి తలుపులు కొట్టి వ్యక్తిగత దూషణలు చేసిన వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గాజులకొల్లివలసకు చెందిన గేదెల జయలక్ష్మి బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలో గాజులకొల్లివలస గ్రామ పంచాయతీకి చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ కుటుంబం సంగమేశ్వర ఆలయం వద్ద నివాసం ఉంటుంది. అదే ప్రాంతంలో గాజులకొల్లివలస ఆర్అర్ కాలనీలో నివాసం ఉంటున్న సొండి రమేష్ మంగళవారం అర్ధ రాత్రి మద్యం తాగి తన ఇంటి వద్దకు వచ్చి తలుపులు కొట్టి దూషణలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 100 ఫోన్ చేసి ఫిర్యాదు చేయగా తక్షణమే పోలీస్ సిబ్బంది వచ్చి వివరాలు సేకరించారన్నారు.

గోకుల కృష్ణా..గోపాల కృష్ణా..

శ్రీకృష్ణ జన్మష్టమి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. పాఠశాలలు, ఆలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పిల్లలు శ్రీకృష్ణుడుగా..గోపికలుగా ముస్తాబై అలరించారు. చిలిపి కృష్ణుడు వేషధారణలో పిల్లలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పలు గ్రామాల్లో హరేరామ.. హరేకృష్ణ నామ సంకీర్తనలతో.. శ్రీకృష్ణుని చిత్రపటంతో తిరువీధి నిర్వహించారు. ఉట్టికొట్టే కార్యక్రమాల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.



ఇచ్ఛాపురం: బెల్లుపడ కాలనీలోని మందిరంలో పూజలందుకున్న శ్రీకృష్ణుడు



కవిటి: కె.కొత్తూరులో గోపికాకృష్ణుల వేషధారణలో చిన్నారులు



వజ్రపుకొత్తూరు రూరల్: బైపల్లిలో గోపిక వేషధారణలో తేజశ్రీ



టెక్కలి ఉట్టికొట్టే సంబరాల్లో చిన్నారులు



ఇచ్ఛాపురం రూరల్: ఎం.తోటూరు ప్రాథమిక పాఠశాలలో రాధాకృష్ణుల వేషధారణలో విద్యార్థులు



టెక్కలి: రోటరీనగర్ సత్యసాయి శాంతి సుధా మందిరం వద్ద శ్రీకృష్ణుడు, యశోద, గోపికల వేషధారణలో చిన్నారులు



నందిగాం: పోతులూరులోని రాధాకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



ఇచ్ఛాపురం రూరల్: భవానీపురం అంగన్‌వాడీ కేంద్రంలో అష్టమి వేడుకలు



కంచిలి: అంపురం పాఠశాలలో కృష్ణుడి వేషాధారణలో విద్యార్థులు

ఆ'వే'దన తీరింది





పలాస మండలం బ్రాహ్మణతర్లా రోడ్డు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఒకప్పుడు ఈ రోడ్డుపై ప్రయాణం చేసేందుకు బాటచారులు నానా ఇబ్బందులు పడేవారు. పూర్తిగా గోతులు మయంగా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి నుంచి గట్టెక్కారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.20 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో గరుడఖండి నుంచి బ్రాహ్మణతర్లా వరకు ఐదు కిలోమీటర్ల రోడ్డు పనులు పూర్తికావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

-పలాస

కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి

పలాస: గొల్లమాకన్నపల్లి గ్రామానికి చెందిన రాపాక చిన్న అప్పలస్వామి (45) బుధవారం సాయంత్రం కిడ్నీ వ్యాధితో మృతి చెందాడు. డయాలసిస్ చేయించుకోవడానికి హరిపురం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లిన ఆయన అక్కడే తుదిశ్వాస విడిచారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కొత్తగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ రోణంకి ఉమ, జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన మండల పరిషత్ సమావేశంలో తీర్మాణం చేసి ఎంపీడీవో ఆమోదంతో జిల్లా కలెక్టర్‌కు, జిల్లా పరిషత్ సీఈవోకు మంజూరు నిమిత్తం ప్రతిపాదన పంపామన్నారు. ఉత్తర్వులు వెలువడగానే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పనులు ప్రారంభిస్తామన్నారు.

9న ప్రభుత్వ ఐటీఐ హాస్టల్ ప్రారంభం

కాశీబుగ్గ: పలాసలోని డాక్టర్ కణితి ప్రభుత్వ ఐటీఐ ట్రైనీ హాస్టల్‌ను ఈ నెల తొమ్మిదో తేదీన ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పైల జవహార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో నిర్మించిన వసతి గృహాన్ని మంత్రి సీదిరి అప్పలరాజు ప్రారంభిస్తారన్నారు. ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు, జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, లయన్స్ బోర్డ్ అపాయింటెడ్ ట్రస్టీ ఎం.విజయకుమార్‌రాజు, ఐఏఎస్ అధికారులు అరుణ్‌కుమార్, బి.నవ్య పాల్గొంటారన్నారు.

యూడీఎఫ్ నాయకుల సంతాపం

మందస: దున్నవూరు పంచాయతీ గెద్దవూరు గ్రామానికి చెందిన ఉద్దానం డెవలప్‌మెంట్ ఫోరం నాయకుడు పిచ్చుక కిరణ్ తల్లి అప్పలమ్మ కిడ్నీవ్యాధితో మరణించారు. దీంతో యూడీఎఫ్ నాయకులు సాౖర రామారావు, దున్న గాంధీవర్మ, గౌరకల పాపారావు, అడతాల మనోజ్, మడియా ప్రశాంత్, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మణ్ తదితరులు బుధవారం కిరణ్‌ను పరామర్శించి సంతాపం తెలియజేశారు.

జీడి పరిశ్రమలను తెరిపించాలి



నిరసన తెలియజేస్తున్న జీడి కార్మికులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని జీడి పరిశ్రమల యజమానులు బంద్‌ను విరమించి తక్షణమే వాటిని తెరవాలని కాష్యూ లేబర్ అసోసియేషన్ అధ్యక్షుడు, 20వవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అంబటి ఆనందరావు కోరారు. ఈ మేరకు కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద జీడి కార్మికులతో కలిసి బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయి బాలాజీ జీడి పరిశ్రమలో పనిచేస్తున్న పదిహేను మంది జీడి కార్మికులపై దొంగ అని ముద్రవేసి జీడి పరిశ్రమలను మూసివేయడం తగదన్నారు. తక్షణమే పరిశ్రమలను తెరిచి కార్మికులకు జీవనోపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నెయ్యిల గణపతిరావు, జోగి నాగేశ్వరరావు, లండ రమణ, కె.కోదండరావు, లండ రాజేశ్వరి, చొక్కర రమ్య, కాలమ్మ, నాగమణి, యువ నాయకుడు బొంపల్లి సునీల్‌వర్మ, పల్లి కృష్ణారావు, ఆటో యూనియన్ నాయకుడు కిర్మి బాబూరావు, మోహనరావు, భైరాగి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలను కలిపే కేటీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గురువారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ భూషణ్‌రావు తెలిపారు. కాశీబుగ్గ పరిధిలో ఉన్న కేటీరోడ్డు, చేపలమార్కెట్, సూదికొండ, శివాజీనగర్, సాయికాలనీ, వివేకానందకాలనీ, పలాస పరిధిలోని ఉదయపురం, పురుషోత్తపురం ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

స్పీడ్‌బ్రేకర్ల పేరుతో రోడ్డు తవ్వేస్తున్నారు..



తిప్పనపుట్టుగ వద్ద రోడ్డును తవ్వేసిన దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: రెండు దశాబ్దాల కాలం తరువాత కోట్ల రూపాయలు వెచ్చించి వేసిన తారు రోడ్డును స్పీడ్ బ్రేకర్ల పేరిట కొంతమంది అడ్డ దిడ్డంగా తవ్వేసి రోడ్డు స్వరూపాన్నే మార్చేస్తున్నారు. సోంపేట నుంచి ఈదుపురం మీదుగా ఇచ్ఛాపురం వరకు ఇటీవల ప్రభుత్వం తారు రోడ్డును వేసింది. ఇంకా సదరు కాంట్రాక్టర్‌కు పూర్తి స్థాయిలో బిల్లు కాకుండానే ఈదుపురం గ్రామంలో తొమ్మిది చోట్ల పదకొండు స్పీడ్ బ్రేకర్లు వేయగా, వందదుగుల తిప్పనపుట్టుగ రోడ్డులో నాలుగు స్పీడ్ బ్రేకర్లను వేయడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురౌతున్నారు. విషయాన్ని ఆర్అండ్‌బీ జేఈ మోహనరావు వద్ద ప్రస్తావించగా.. స్పీడ్ బ్రేకర్లను తాము వెయ్యలేదన్నారు. రాత్రి సమయాల్లో కొంతమంది రోడ్డును కటింగ్ మిషన్‌తో తవ్వేసి పెద్ద పెద్ద సిమెంట్ దిమ్మలను కడుతున్నారన్నారు. ఈ విషయమై ఇప్పటికే రోడ్డు కాంట్రాక్టర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న దృశ్యం

టెక్కలి: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా టెక్కలికి చెందిన ప్రజా చైతన్య కళా సమితి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నేత్రదానంపై అపోహలు తొలగిద్దాం.. ప్రతి ఒక్కరూ నేత్రదానం చేద్దాం.. అంధుల కళ్లల్లో వెలుగులు నింపుదాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం నేత్రదానంపై అపోహలు తొలగిస్తూ లఘునాటికను కళాకారులు ప్రదర్శించారు. కార్యక్రమంలో టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావు, నేత్ర వైద్యులు ఎ.శ్రీరాములు, ఆప్తాల్మిక్ బి.జె.ఎస్.ప్రసాదరావు, కళా సమితి బృందం సభ్యులు ఎ.చిట్టెన్న, చిలుకు కృష్ణారావు, ఎం.తాతయ్య, బి.కృష్ణారావు, యు.గణపతి రావు, ఎం.పద్మనాభరావు, ఆర్.వి.రమణమూర్తి, ఆర్.రమేష్‌కుమార్, మోహన్‌రావు పాల్గొన్నారు.

102 మందికి వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం: పురపాలకసంఘం పరిధి కండ్రవీధి పురపాలక సంఘం ప్రాథమిక పాఠశాల ఆవరణలో జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు కె.బాను సాయి తదితరులు 102 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో జెమ్స్ అసిస్టెంట్ మేనేజర్ చిన్నారావు, టెక్నిషియన్ పార్వతి, పీఆర్వో సంతోష్ పాల్గొన్నారు.

ఎండిపోతున్న వరినాట్లు



మాట్లాడుతున్న మాధవరావు

మందస: వర్షాభావ పరిస్థితులు దృష్ట్యా ఖరీఫ్ సీజన్‌లో వరినాట్లు ఎండిపోతున్నాయని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. హరిపురంలోని మార్పు గ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడుతూ.. సరైన వర్షాలు లేకపోవడంతో కరువు పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితిలో గ్రామాన్ని యూనిట్‌గా చేసుకొని కరువు మండలాలను ప్రకటించాలన్నారు. వంశధార, నాగావళి, బహుదా నదీ పరీవాహక ప్రాంతాల్లో మాత్రమే నాట్లు పడ్డాయన్నారు. పలాస డివిజన్‌లో వర్షపాతం బాగా తక్కువగా ఉందన్నారు. మందస మండలంలోని సంకుజోడు, కళింగదళ్, డబారిసింగి రిజర్వాయర్ల సామర్థ్యం పెంచి, రైతులను ఆదుకోవాలని కోరారు. వంశధార ఎడమ కాలువను ఇచ్ఛాపురం వరకు పెంచాలని, ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను యుద్ధప్రాతిపదికను పూర్తి చేయాలని కోరారు. సంఘం నాయకులు వంకల మాధవరావు, భైరి కూర్మారావు, మామిడి భీమారావు, ఐఎఫ్‌టీ నాయకుడు జుత్తు వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబ సభ్యులకు పరామర్శ

సంతబొమ్మాళి: నర్సాపురం సర్పంచ్ దుక్క భూషణ్‌రెడ్డి తండ్రి బాబూరావు గుండెపోటుతో బుధవారం చనిపోయారు. దీంతో భూషణ్‌రెడ్డి కుటుంబ సభ్యులను కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పరామర్శించి సంతాపం తెలియజేశారు. నందిగాం ఎంపీపీ శ్రీరామ్‌మూర్తి, వైఎస్సాసీపీ నాయకులు కురమాన బాలకృష్ణ ఉన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు

మందస: సొండిపూడి సచివాలయంలో కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిచ్చుల శ్రీనివాసరావు, దడ్డ కిరణ్‌కుమార్, ఉప సర్పంచ్ రామచంద్రచౌదరి, సచివాలయం సిబ్బంది బొంతు రమణ, కీర్తన, వలంటీర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న దేవదాస్‌రెడ్డి

కంచిలి: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. ఎం.ఎస్.పల్లి గ్రామ సచివాలయ పరిధిలో రూ. 2.4 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం భూమిపూజ చేశారు. సర్పంచ్ కొనపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బి.విశ్వనాథ్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మిడి రాందాసు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దుర్గాసి ధర్మారావు ఉన్నారు.

చురుగ్గా ఆధార్ సీడింగ్



పంచాయతీ కార్యాలయం వద్ద ఆధార్ నంబర్లను అనుసంధానం చేస్తున్న వలంటీర్లు, విద్యుత్ సిబ్బంది

నరసన్నపేట: విద్యుత్ పంపిణీ సంస్థల ఆదేశాల మేరకు మండలంలోని టౌన్, రూరల్ పరిధిలో ఉన్న విద్యుత్ మీటర్లకు ఆధార్ సీడింగ్ ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది. ఇప్పటివరకు మండలంలో 53 శాతం వినియోగదారులు తమ విద్యుత్ సర్వీస్ నంబర్‌తో ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయించుకున్నారు. మరో 10 రోజుల కల్లా ఆధార్ సీడింగ్ పూర్తిచేయాలని విద్యుత్ పంపిణీ సంస్థలు కింది స్థాయి సిబ్బందికి ఆదేశించడంతో ఈ మేరకు ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది. టౌన్ ఏఈ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతీ విద్యుత్ వినియోగదారుడు తమ పేరున ఉన్న సర్వీస్ నంబర్‌తో ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలన్నారు.